

# సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి


దత్తప్పగూడెంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు, అక్టోబర్ 15 : సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం అని ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దత్తప్పగూడెంలో ఎలుగు సోమయ్యకు రూ.60 వేలు, బరిగల కోటేశ్‌కు రూ.44 వేలు, కంబాల చలమందకు రూ.60 వేలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు కాగా చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలుగు శోభాసోమయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు సాజీద్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఎలుగు యాదయ్య, నాయకులు గనగాని యాదగిరి, గంగుమల్లు, వెంకటేశ్, దేవసరి రాములు, అష్రఫ్‌జానీ, ప్రవీణ్, మత్స్యగిరి, స్వామి పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు

- రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్


మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఎన్నికల నియమావళిపై సిబ్బందికి సూచనలు చేస్తున్న రాచకొండ సీపీ

మోత్కూరు, అక్టోబర్ 15 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్ తెలిపారు. ఆదివారం మోత్కూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళిపై సిబ్బందికి దిశా నిర్ధేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో 25 పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.7 కోట్లను ఇప్పటికే సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల నియమావళి మేరకు రాజకీయ నాయకులు ప్రచారం చేసుకోవాలన్నారు. నియమావళి ఉల్లంగించి వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీసీపీ రాజేశ్‌చంద్ర, ఏసీపీ మొగిలయ్య, సీఐ మోతీరామ్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డి
- బతుకమ్మ అలంకరణ విజేతలకు బహుమతులు


బతుకమ్మ విజేతలతో మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డి

మోత్కూరు, అక్టోబర్ 15 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందేలా కాపాడుకోవాలని మోత్కూరు మున్సిపల్ చైరపర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డి అన్నారు. మోత్కూరు ప్రజాభారతి సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపువ్వు బతుకమ్మ అలంకరణ పోటీల్లో విజేతలకు ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో బహుమతులను ప్రదానం చేసి మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూల పండుగ బతుకమ్మ తెలంగాణకే సొంతమన్నారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కౌన్సిలర్లు కళ్యాణ్ చక్రవర్తి, పురుగుల వెంకన్న, రైతు బంధు జిల్లా కమిటీ సభ్యురాలు దబ్బెటి శైలజ, కో ఆప్షన్ సభ్యురాలు ఆనందమమ, కట్టా ఇంద్రజ్యోతి, మర్రి అనీల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేఘారెడ్డి, ప్రజాభారతి అధ్యక్ష, కార్యదర్శులు అరంవిందరాయుడు, వెంకన్న, ప్రతినిధులు జయశ్రీ, ఎస్ఎన్ చారి పాల్గొన్నారు.

# అభివృద్ధిని గడపగడపకూ వివరించాలి

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సంజీవరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సంజీవరెడ్డి

నూతనకల్, అక్టోబర్ 15 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకూ వెళ్లి వివరించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూరెడ్డి సంజీవరెడ్డి, జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బిక్కుమళ్ల, మాచనపల్లి, లింగంపల్లి, పెదనెమిల గ్రామాల్లో ఈ నెల 29న తుంగతుర్తిలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత జరిగిన అబివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, నాయకులు మల్లయ్య, సాయిల్, గంగయ్య, సత్తయ్య, లింగయ్య, నాగేశ్, ఎర్రయ్య, కోటేశ్, జాన్, రవి, వెంకన్న, తోల్య పాల్గొన్నారు.

# మహిళల జీవితాల్లో 'లక్ష' కాంతులు

నాడు రూ.20 వేలు మిత్తికి పోతే నేటి లక్ష జీవితాన్ని మార్చింది

ఎస్‌హెచ్‌జీ రుణాల సద్వినియోగం

ఆర్థిక వృద్ధితో కుటుంబాలకు బాసటా


హోమ్ ఫుడ్స్ తయారు చేస్తున్న మహిళలు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 14 : ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల పక్షపాతిగా ఉంటూ వారి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో నేడు ఎంతోమంది మహిళలు తమ కాళ్లపై తాము నిలబడడమే కాకుండా కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు. మరికొందరు మహిళలు ఒంటరి వారైనప్పటికీ అధైర్యపడకుండా రాష్ట్ర ప్రభుత్వం పొదుపు సంఘాల ద్వారా అందిస్తున్న రూ.లక్ష రుణంతో చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి అభివృద్ధిలోకి వచ్చారు. ఒంటరి మహిళలైనప్పటికీ ప్రభుత్వ సహకారంతో తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకున్నారు. నాటి ప్రభుత్వాలు పొదుపు సంఘాల ద్వారా రూ.20 వేలు ఇస్తే అది తెచ్చిన అప్పుల మిత్తికే సరిపోయేదని, నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్షతో వ్యాపారాలు మొదలుపెట్టి తాము ఆర్థికంగా అభివృద్ధి చెందామని అందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలుపుతున్నారు.

## రూ.లక్ష రుణం మా జీవితాన్ని మార్చింది



నాకు చిన్న వయస్సులోనే పెండ్లి అయింది. పిల్లలు చిన్నగున్నప్పుడే భర్త దూరమైండు. ఇద్దరు ఆడపిల్లలను పెట్టుకుని కాయ కష్టం చేస్తూ జీవితాన్ని నెట్టుకొచ్చా. వచ్చే ఆదాయం కుటుంబానికి సరిపోక అప్పులు చేసేది. సొంతంగా ఏదైనా చేసుకుందామంటే డబ్బుల సమస్య. గత ప్రభుత్వంలో పొదుపు సంఘం ద్వారా పొందిన రుణం రూ.20 వేలు బయట తెచ్చిన అప్పుల మిత్తికే సరిపోయేది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రూ.లక్ష రుణం తీసుకున్నా. ఆ డబ్బుతో ఇంటి వద్దే హోమ్ ఫుడ్స్ తయారు చేసి విక్రయిస్తున్నాం. నెలకు రూ.25 వేలకు పైగా ఆదాయం వస్తుంది. ప్రస్తుతం నా ఇద్దరు పిల్లల పెండ్లి చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి నెల బ్యాంక్‌లో వాయిదాలు కడుతున్నా. లక్ష రుణం మా జీవితాన్ని పూర్తిగా మార్చింది. ఒంటరి మహిళనైన నాకు రూ.2 వేల పెన్షన్ అందించి మా జీవితాలను ఆదుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా ఉంటాం.

– డి.రమాదేవి, స్నేహ సంఘం అధ్యక్షురాలు, సూర్యాపేట

## నా బిడ్డ పెండ్లి చేశా



గత ప్రభుత్వాలు మహిళా సంఘాల సభ్యులకు రూ.20 వేలు ఇస్తే అవి ఏ మూలకు సరిపోయేవి కావు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నేడు లక్ష రూపాయల రుణం తీసుకున్నా. ఇంటి వద్దే హోమ్ ఫుడ్స్ తయారు చేయడమే కాకుండా శుభకార్యాలకు వంటలు చేయడం, క్యాటరింగ్ చేస్తుంటా. నెలకు రూ.20 నుంచి 25 వేల వరకు ఆదాయం వస్తుంది. భర్త చనిపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డా. బిడ్డ పెండ్లి చేశా. కొడుకును బాగా చదివిస్తున్నా. నేడు నాలుగు పైసలు కండ్ల చూస్తున్నామంటే కారణం ముఖ్యమంత్రి కేసీఆర్. ప్రభుత్వం మాకు రూ.5 నుంచి 10 లక్షల వరకు రుణం అందిస్తే మేము మరింత ఆర్థిక వృద్ధి సాధిస్తాం. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మా కుటుంబాలు రుణపడి ఉంటాయి.

– కనుకుంట్ల ఉప్పమ్మ, అభ్యుదయ సంఘం అధ్యక్షురాలు, సూర్యాపేట

# ఎమ్మెల్యే కిశోర్‌తోనే తుంగతుర్తి అభివృద్ధి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య

తుంగతుర్తి, అక్టోబర్ 15 : ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్‌తోనే తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. ఆదివారం మండలంలోని బండరామారం గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడోసారి ముచ్చటగా కిశోర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల నాయకులు గడ్డం ఉప్పలయ్య, లకావత్ శారదామాన్‌సింగ్, ఆకారపు సైదులు, వీరబోయిన రమేశ్, లాకావత్ రాములు, పులుసు ఉప్పలయ్య, లకావత్ సత్యం, లకావత్ భిక్షం, పాడేటి యాదగిరి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి..

మద్దిరాల : మండలంలోని ఆయా గ్రామాల్లో గల ఎస్సీ కాలనీల్లో ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని రైతు బంధు సమితి జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్ఏ రజాక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్సీ సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించి మాట్లాడారు.


మద్దిరాల : పోలుమల్లలో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఏ రజాక్

### బూత్ కమిటీల సమావేశాలు..

మండలంలోని చౌవుల్లతండా, గోరెంట్ల, పోలుమల్ల, చందుపట్ల, చిననేమిల, మామిండ్లమడవ, తూర్పుతండాలో బూత్ కమిటీ సమావేశాన్ని ఎస్ఏ రజాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి ఓటు అడుగాలన్నారు. సమావేశాల్లో వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరామ్‌రెడ్డి, జిల్లా నాయకులు గుడ్ల వెంకన్న, దుగ్యాల రవీందర్‌రావు, కన్న వీరన్న, సూరినేని నర్సింహారావు, ఆకుల ఉప్పలయ్య, కోడి శ్రీను, శిరంశెట్టి వెంకన్న, ఆయా గ్రామాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు.


తుంగతుర్తి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య


తిరుమలగిరి : బూత్ కమిటీ సభ్యులతో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి